# పాతదే కథ

అనగా అనగా ఒక భూకామందు.

ఆ కామందుకి ఏడుగురు వ్యాపారి కొడుకులు.

ఏడుగురు కొడుకులూ కలిసి ఓసారి లాభాల వేటకి వెళ్లేరు. వెళ్లి ఏడుగురూ ఎండు కూలీల్ని పట్టి తెచ్చేరు. తెచ్చేక, వాళ్ళని ఎండలో బండరాళ్లు తవ్వమన్నారు. మొయ్యమన్నారు.

ఆరుగురు కూలీలు కిక్కురుమనకుండా బండచాకిరీ చేసేరు.

ఒకడు మాత్రం ఎండబాధా, రాళ్ల బరువూ భరించలేక, దూరంగా పోయి, ఓ ఎండుగడ్డి (మేటు) నీడని ఏడుస్తూ కూర్చున్నాడు.

ఏడ్చే కూలీని చూసి ఏడుగురు వ్యాపారి కొడుకులూ నిర్ఘాంతపోయేరు. ఆ తరవాత ఉగ్రకోపులయేరు.

"ఏఁవిఁరా కూలీ కూలీ! నీడనా కూర్చుంటావు? ఏడుపా ఏడుస్తావు?" అని ఒళ్లెరగని కోపంతో కేకలేసేరట వ్యాపారి.... ....... కొడుకులు.

అందుకు ఆ ఏడో కూలీవాడు ఏదో చెప్పబోయి శోషొచ్చి పడిపోయేట్ట.

అప్పుడు ఏం జరిగిందో తెలియక, ఆ ఏడుగురు వ్యాపారపు కొడుకులూ (ఎక్కడికీ వెళ్లకుండా) అక్కడకే తమ మానేజర్ని పిలిపించి అడిగేరట.

మానేజరు చాలాసేపు ఆలోచించి తన సెక్రటరీని పిలిపించేట్ట.

సెక్రటరీ అర్జంటుగా వెళ్లి లేబర్ ఆఫీసర్ని దగ్గిరుండి తీసుకొచ్చేట్ట.

లేబర్ ఆఫీసర్ లేటుగా వెళ్లి కంపెనీ డాక్టరుకి ఫోన్ చేసేట్ట.

డాక్టరు గారి డిస్పెన్సరీ ఫోన్ చచ్చిపోయిందిట, ఇంటి ఫోన్ బతికే ఉందట. కాని వారికి కబురు వెళ్లేసరికి చాలాసేపయిందిట.

కబురందిన తరువాత డాక్టర్ గారు వచ్చి చూసి ఆ ఏడో కూలీకి నూరేళ్లూ నిండు కున్నాయని చెప్పేసి, వెంటనే బిల్లు రాసి ఇచ్చి డబ్బు పుచ్చుకొని వెళ్లిపోయేట్ట.

బతికున్న కూలీలు అక్కడికివచ్చి "మావాడు ఎందుకు చచ్చేడు?" అని అడిగేరట.

కర్మకాలి చచ్చేడని ఏడుగురు వ్యాపారి కొడుకులు ఏకకంఠంతో జవాబు చెప్పేరుట.

ఆ తరువాత వాళ్లు కంపెనీ మీటింగు పెట్టి, "నిజమైన కారణం ఏఁవిఁటయ్యా?"

అని తమ కంపెనీ డాక్టర్ని రహస్యంగా అడిగేరట.

"నిజం తెలుసుకోవడం మంచిదికాదు" అన్నాట్ట డాక్టరు.

"ఆరుగురు కూలీలు కూడా అలానే చస్తే మరి మాకు దొంగ లాభాలెలా వస్తాయి?" అని ఏడుగురు కొడుకులూ వెక్కి వెక్కి ఏడ్చేరట.

జబ్బులమీద బలిసిన దొడ్డ డాక్టరు ఆ ఎండుకూలీ తిండిలేక చచ్చేడు" అని అప్పుడు అసలు నిజం చెప్పేట్ట.

"కూలీలంతా చావకుండా బతకాలంటే ఏం చెయ్యాలి?"అని ప్రశ్నించేరుట ఏడుగురు వ్యాపారి కొడుకులూను.

"తిండి పెట్టండి" అని సలహా చెప్పి, బిల్లు రాసి యిచ్చి ఫీజు పుచ్చుకొని వెళ్లిపోయేట్ట, బిల్లుల మీద బలిసిన ఆ తెల్ల డాక్టరు.

అప్పుడు ఏడుగురు వ్యాపారపు కొడుకులూ ఏక కంపెనీగా కూర్చుని, "ఏం చెయ్యాలి?" అని చర్చించుకున్నారట.

కూలీలకి తిండి పెడుతున్నాం కదా అన్నాట్ట ఓ కొడుకు, పెద్దవాడు వాసు.

"ఏఁవిఁటో తిండి" అడిగేట్ట కొడుకు.

"పచ్చివి ఎంతో మంచివి మంచినీళ్లు" అన్నాడు మానేజింగు పెద్దకొడుకు.

"అయితే వారికి అవి చాలవన్నమాట" అన్నాడు రెండో కొడుకు.

"మరేం చెయ్యాలి?" అని అమాయకంగా అడిగేట్ట మూడో కొడుకు.

"మంచినీళ్లతోపాటు కొంచెం పచ్చమన్ను ఇస్తేనో" అని ఓ సూచన చేసేట్ట నాలుగో కొడుకు.

"అదిస్తే మన లాభాలకి పెద్దదెబ్బ" అన్నాట్ట పెద్దకొడుకు.

"ఎంత దెబ్బ?" అని అడిగేడు అయిదో కొడుకు.

"మనకి ఇప్పుడు నూటికి రెండు వందలే లాభం; పచ్చమన్ను కూడా వేసేం అంటే ఓ పావలా మేరకి దెబ్బ". అన్నాడుట అన్నీ తెలిసిన అన్నగారు.

ఆ మాట (అంటే పావలా దెబ్బ మాట వినగానే) పాపం .... .... ఆ ఆఖరి కొడుకు మూర్ఛపోయేట్ట.

డాక్టరొచ్చి, డబుల్ బిల్లు రాసి ఇచ్చి, డబ్బులు పుచ్చుకొని వెళ్ళిపోయేక (అంటే ఆఖరి కొడుకు మూర్ఛలోంచి లేచేక) మీటింగు మళ్ళీ జరిగిందట.

ఎండు కూలీలకి పచ్చమన్ను పెట్టకూడదని కంపెనీవారు ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారట.

దాన్తో ఆరుగురు కూలీలు హరీ మన్నారట.

ఏడుగురు కొడుకులూ కూలివేటకి వెళ్ళి మరో ఏడుగురు కూలీల్ని పట్టి తెచ్చేరట. వాళ్లకూడా చచ్చేరట.

ఇలా అయిదారుసార్లు జరిగేసరికి నూటికి రెండు వందల లాభం బదులు నూటయేభయ్యే లాభం తేలిందట.

అంతే లాభం అని తెలిసేసరికి ఏడుగురు వ్యాపారపు కొడుకులూ కూడా గుండెలు ఆగిపోయి చచ్చి మళ్ళీ వెంటనే బతికేరట. బతికి "అబ్బా, అబ్బా!" అని గుండెలు బాదు కొంటూ, భూ కామందైన తండ్రిగారి దగ్గరికి వెళ్ళి ఆయన కాళ్ళమీద పడ్డారట.

అప్పుడు భూకామందైన ఆ తండ్రి అన్ని విషయాలూ తెలుసుకొని చిరునవ్వు నవ్వి.

"నాయనలారా! నా చిన్ని పొన్ని కొడుకుల్లారా! మనం బతకాలంటే కూలీలు చావకూడదు. వారుకూడా బతకాలి. కాని, మనం బాగుపడాలంటే వారు చావాలి" అని గంభీరంగా ఉపన్యసించి ఊరుకున్నాట్ట.

"తండ్రీ! వివరంగా, విపులంగా విశదీకరింపుము!" అని బతిమాలుకున్నారట బద్ధిమంతులైన ఆ ఏడుగురు కొడుకులూను.

అప్పుడు -

ఆ భూకామందులవారు

"ఓ నా చిట్టి పొట్టి పిల్లల్లారా, మేలిమి బంగరు పిచ్చికల్లారా! మనం బాగుపడాలంటే కూలివాండ్రు చావనూ చావకూడదు. బతకనూ బతకకూడదు. వారు చస్తే మనకి ఎట్టి లాభము సంపాదించే అవకాశమున్నూ ఉండదు గనుక మన లాభములకు కొంత నష్టము కలిగిననూ వారిని మనము కొంతవరకు కొనవూపిరితో వుంచవలెను. నూరు రూకల లాభములకు ఒక రూక ఖర్చయిన మన సొమ్మేమిపోయినది? అందుచేత నేటినుండి వారికి మీరు మనిషికి ఇంత ఎండుగడ్డి, ఇంత (ఉప్పుబద్ద కలిపిన) మంచినీరూ, అని నిర్ణయించి ఇచ్చి, వారు చావకుండా చూచుకొనండి! కాని, ఒకమాట! ఎప్పుడైనా తప్పనప్పుడు మరికొంత గడ్డి వేస్తే వెయ్యండిగాని, వారికి ఓనమాలు మాత్రం చెప్పించకండి. ఆది శంకరుడు ఏమి చెప్పెను? జ్ఞానమార్గమే అసలు మార్గమని అనలేదా అతడు?! అందుచేత కూలీజనులకు జ్ఞాన మార్గములన్నీ బంద్ చేయుడి! సెక్సు సినిమాలు చూపించండి. సురాపానము చేయించండి! మరొక రెండు గడ్డిపరకలు పడవేయండి! కాని జ్ఞానదీపాలు వారు వెలిగించుకోకుండా మాత్రం మీరు బహు పరాగ్గా ఉండండి" అని విశదీకరించేరు.

ఆ ఉపదేశం పొంది బాగుపడ్డారు వ్యాపారపు కొడుకులు.

అప్పటి నుండి కూలీలందరికి రెండేసి పరకల చొప్పున ఎండుగడ్డి, మూడేసి చుక్కల చొప్పున ఉప్పునీరూ సప్లయి కాజొచ్చేయి.

అప్పుడు -

వ్యాపారపు చోర పుత్రులంతా చేరి ఏమన్నారూ అంటే ? -

"ఇదే సోషలిజం!" అన్నారు.

అప్పుడు చోరనాయకులు కొందరు కార్మిక నాయకులుగా మారి

"అవునిదే సోషలిజం!"

- అని అరిచి అరిచి చెప్పి వారుకూడా కంపెనీ డాక్టర్లాగే డబ్బులు పుచ్చుకొని ఇంటికి వెళ్ళారు. అయితే, అందుకు బిల్లులు మాత్రం ఉండవుట.

ఇది కథ. ఇదింకా కంచికి మాత్రం వెళ్ళలేదు. ఎందుచేతనూ అంటే ఎందు కూలీలంతా ఎండలోనే ఉన్నారు. భూకామందుల వ్యాపారపు కొడుకులు లాభాల వేటలో ఇంకా ఈ లోకంలోనే, మన పీకలమీదే ఉన్నారు.

***ఆంధ్రజ్యోతి వారపత్రిక, 5-1-1968***